క్లుప్తంగా

పీఏసీఎస్ ఎస్‌ఓగా బాధ్యతల స్వీకరణ



నెక్కొండ : స్థానిక పీఏసీఎస్ ప్రత్యేక అధికారి (ఎస్‌ఓ)గా కీరూనాయక్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్‌లో అక్రమాలు చోటు చేసుకున్న నేపథ్యంలో పాలకవర్గాన్ని రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా కీరూనాయక్‌ను నియమించింది.

చెరువు కట్టపై ముళ్లపొదల తొలగింపు



చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండా శివారులోని తొర్రగుట్ట చెరువు కట్టపై ముళ్లపొదల తొలగింపు పనులను లోడీ సాంఘిక సేవా స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్లు కిరణ్‌రెడ్డి, వీరబాబు మంగళవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. రైతుల సంక్షేమమే సంస్థ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు వీరన్ననాయక్, లోడీ సంస్థ మండల కోఆర్డినేటర్ జనగాం రమేశ్, గ్రామ పెద్దలు బానోతు రవి, భూక్య భద్రు, బిక్కు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక



నల్లబెల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఉడుత నమ్రత ఎన్‌ఎంఎం స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. స్కూల్ ఆవరణలో ఆమెను హెచ్‌ఎం అంబి వసంత, ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. నమ్రత స్ఫూర్తితో విద్యార్థులు ప్రతిభా పోటీల్లో విజయం సాధించాలని సూచించారు. నమ్రతకు ఏటా రూ.12 వేలు చొప్పున నాలుగేళ్లపాటు స్కాలర్‌షిప్ అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మజ, కుమారస్వామి, శ్రీధర్‌బాబు, సంతోశ్‌కుమార్, అన్నాదేవి, బుచ్చన్న, శోభావాణి, జ్యోతి, హేము, శంకరయ్య, వసీమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీలో భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) ఆవిర్భావ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చక్రవర్తుల వెంకటేశ్వర్లు జెండా ఆవిష్కరించి మాట్లాడారు. రైతుల హక్కుల పరిరక్షణకు సంఘ్ పోరాడుతుందని చెప్పారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొమ్మినేని సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘డ్రంకెన్ డ్రైవ్’లో ఒకరికి జైలు

నెక్కొండ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో న్యాయమూర్తి ఒకరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈనెల 2న స్థానిక రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ ప్రభాకర్ పోలీసులకు చిక్కాడు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రభాకర్‌ను నర్సంపేట కోర్టులో హాజరు పర్చగా స్పెషల్ మెజిస్ట్రేట్ లక్ష్మి నారాయణ మూడ్రోజుల సాధారణ జైలుశిక్షతోపాటు వెయ్యి రూపాయల జరిమానా విధించారు. వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడపొద్దని ఎస్సై కోరారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



వర్ధన్నపేట/పర్వతగిరి : వర్ధన్నపేట, పర్వతగిరి మండల కేంద్రాల్లో స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు జన్మదిన వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వర్ధన్నపేటలోని జెడ్పీ సెకండరీ స్కూల్‌లో ఆ పార్టీ జిల్లా నాయకుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు అందజేయగా పర్వతగిరిలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ వర్ధన్నపేట పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, నాయకులు కూసం రాంచందర్, తూళ్ల రవి, అఫ్సర్, నానునాయక్, సమ్మెట సుధీర్, సునీల్‌రావు, దారం పూర్ణచందర్, బందెల వెంకన్న, బొట్ల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం ఎప్పుడో..?

● డ్రెయినేజీని తలపిస్తున్న వైనం



మట్టి రోడ్డుపై గుంతల్లో నిలిచిన మురుగునీరు, వ్యర్థాలు

నర్సంపేట రూరల్ : నర్సంపేటలోని 4వ, 5వ వార్డుల నుంచి పాకాల్–మహబూబాబాద్ బైపాస్‌కు వెళ్లే దారిలో సీసీ రోడ్డు ఎప్పుడు నిర్మిస్తారో..? అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో సైడ్ డ్రెయినేజీలు సైతం నిర్మించకపోవడంతో ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థాలు, మురుగు రోడ్డు మీదే నిలుస్తోంది. రహదారి గుంతలమయమై వర్షపు, డ్రెయినేజీ మురుగు నీరు చేరడంతో ప్రజలు నడవటానికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకోగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినా పట్టించుకోలేదని విమర్శలున్నాయి.

నర్సంపేటలోని 4వ, 5వ వార్డుల మీదుగా పాకాల్–మహబూబాబాద్ బైపాస్ వెళ్లే రోడ్డులో ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. ప్రభుత్వం గతంలో ఈ దారిలో కొంత మేర సీసీ రోడ్డు వేయించింది. మిగతా రోడ్డు వదిలేసిన దుస్థితి నెలకొంది. ఈ రోడ్డుకు సైడ్ డ్రైనేజీలు సైతం నిర్మించలేదు. దీంతో ఇళ్ల నుంచి వస్తున్న వృథా నీరు నేరుగా రోడ్డు మీదుగానే ప్రవహిస్తోంది. వర్షాకాలంలో వరద నీరు సైతం ఈ మట్టి రోడ్డు మీదుగా ప్రవహించడంతో మట్టి కొట్టుకపోయి గుంతలమయం అయ్యింది. గుంతల్లో డ్రైనేజీ నీరు చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇళ్లలో నీరు నిల్వకుండా చూసుకోవాలని, దోమలు నివారించేలా ఇంటి ఆవరణలో ఉండే నీటి గుంటలు పూడ్చాలని ప్రచారం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డు మీదే వృథా నీరు ప్రవహిస్తుంటే చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇకనైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి మట్టి రోడ్డును చదును చేసి సీసీ పోయడంతోపాటు సైడ్ కాల్వలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. పాకాల్–మహబూబాబాద్ బైపాస్‌కు వెళ్లే స్థానికులు తప్పనిసరిగా ఈ రోడ్డు మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో మట్టి రోడ్డు మీదుగా వాహనాలపై వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. కొంత మేరకు రోడ్డు నిర్మించి వదిలేశారు. మిగతా రోడ్డు నిర్మాణం చేపట్టి ఇతర సమస్యలు పరిష్కరించాలి.

– తోకల కరుణాకర్, కాలనీవాసి

దోమలు వ్యాప్తి చెందుతున్నాయి



రోడ్డుపై ఉన్న గుంతల్లో మురుగు, వర్షపు నీరు నిలుస్తుండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వృద్ధులు, పిల్లలు రోగాల బారిన పడుతున్నారు. సైడ్ కాల్వలు నిర్మించి గుంతలను పూడ్చాలి. రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుంతల్లో పడి లేస్తుండడంతో వాహనాలు దెబ్బతినడంతోపాటు వాహనదారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

– జన్ను రవి, స్థానికుడు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. రోడ్డును పరిశీలించి శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్డుతోపాటు సైడ్ డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం. ఉన్నతాధికారుల సహకారంతో వీలైనంత త్వరగా రోడ్డు, సైడ్ డ్రైనేజీ సమస్యలు పరిష్కరించే దిశగా చొరవ తీసుకుంటాం. ప్రభుత్వం రోడ్డు మంజూరు చేయగానే పనులు చేపట్టే దిశగా కృషి చేస్తాం.

– రాజేశ్, మున్సిపల్ ఏఈ, నర్సంపేట

గుడుంబా తయారీదారులపై కఠిన చర్యలు

● నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : గుడుంబా తయారీదారులు, విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని నర్సంపేట ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. నర్సంపేట మండలంలోని మాధన్నపేట శివారులోని పర్శనాయక్ తండాకు చెందిన బానోత్ సమ్మయ్య ద్విచక్ర వాహనంపై 5 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా వాహనాల తనిఖీ సందర్భంగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ నరేశ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. గుడుంబాతోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి సమ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా నాయకతండాకు చెందిన బానోత్ వీరన్న ద్విచక్ర వాహనంపై 10 లీటర్ల గుడుంబా తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. అతడి నుంచి గుడుంబా, వాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఆ శాఖ ఎస్సై శార్వాణి, సిబ్బంది లింగేశ్వర్, వాజిద్, సురేందర్, స్వర్ణలత, నాగరాజు, దిలీప్, హైమద్, శివరాజు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

‘తలనీలాల మాయం’ బాధ్యులపై చర్యలు తీసుకోండి



పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ దర్గాలో తలనీలాలు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డ్ సీఈఓకు అన్నారం గ్రామానికి చెందిన జడల కృష్ణ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణ మాట్లాడారు. తలనీలాలు మాయం చేసిన ఘటనలో గొల్లపల్లి అశోక్‌కుమార్, సుబ్బారావు బాధ్యులుగా భావిస్తున్నట్లు తెలిపారు. విచారణ చేపట్టి ఇద్దరి నుంచి రెండేళ్లపాటు జరిగిన అక్రమానికి సంబంధించి సుమారు రూ.60 లక్షలు రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు.

ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి గెలుపు చరిత్రాత్మకం

● పీఆర్టీయూ మండల అధ్యక్షుడు మహేందర్



సమావేశంలో మాట్లాడుతున్న మహేందర్

నల్లబెల్లి : వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థిగా బరిలో నిలిచిన పింగిళి శ్రీపాల్‌రెడ్డి గెలుపు చరిత్రాత్మకమని యూనియన్ మండల అధ్యక్షుడు నక్కిరెడ్డి మహేందర్ అన్నారు. శ్రీపాల్‌రెడ్డి గెలుపు నేపథ్యంలో ఆ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కేజీబీవీలో మంగళవారం సంబురాలు నిర్వహించారు. ఉపాధ్యాయినులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం మహేందర్ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రీపాల్‌రెడ్డిని గెలిపించడం హర్షణీయమన్నారు. శ్రీపాల్‌రెడ్డి సహకారంతో కేజీబీవీ, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి ఉడుత రాజేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు గొని చంద్రశేఖర్, చిట్టిరెడ్డి తిరుపతిరెడ్డి, శ్రీధర్‌బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూరం భద్రీనాథ్, నాయకులు లాక్య, బానోత్ కృష్ణ, బాలు, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కేజీబీవీలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన పసునూరి రఘు మంగళవారం పరీక్ష ప్యాడ్, పుస్తకాలు, ఇతర సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఓ జ్యోతి మాట్లాడారు. మెకానిక్‌గా పని చేసుకుంటున్న వ్యక్తి విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు అవకాశాలను వినియోగించుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద బర్ల దేవదాసు, ఎమ్మార్పీఎస్ డివిజన్ అధ్యక్షుడు ఉప్పలయ్య, ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధికార ప్రతినిధి నర్మెట్ల యాదగిరి, నాయకులు కేశపాక వంశీ, బొమ్మర రవీందర్, ఉపాధ్యాయులు సుజాత తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు పోరాడాలి

● ఎంసీపీఐ(యూ) పొలిట్‌బ్యూరో సభ్యుడు ఉపేందర్‌రెడ్డి



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

దుగ్గొండి : ప్రజాసమస్యల పరిష్కారానికి ఉద్యమించి ప్రాణాలర్పించిన అమరుల ఆశయ సాధనకు పోరాడాలని ఎంసీపీఐ(యు) పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని తిమ్మంపేటలో ఆ పార్టీ సీనియర్ నాయకురాలు నాగెల్లి సాంబలక్ష్మి 4వ సంస్మరణ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబలక్ష్మి స్తూపానికి ఉపేందర్‌రెడ్డి నివాళులర్పించి మాట్లాడారు. అనేక మంది ప్రాణత్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ సమస్యలపై అధ్యయనం చేసి ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాల దిశగా నడిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, నాయకులు గోనె కుమారస్వామి, పెద్దారపు రమేశ్, కుసుంబ బాబురావు, మహ్మద్ రాజాసాహెబ్, కన్నం వెంకన్న, గుండెబోయిన చంద్రయ్య, కనకం సంధ్య, వంగాల రాగసుధ, నాగెల్లి కొమురయ్య, కొత్తకొండ రాజమౌళి, సింగతి మల్లికార్జున్, దామ సాంబయ్య, ఎల్లబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

గీసుకొండ : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఊకల్‌హవేలీలో చోటు చేసుకుంది. మృతుడి తండ్రి వెంకటస్వామి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సాంబారి రాజు (36) ఎస్‌బీఐ నుంచి రూ.5.60 లక్షలు, క్రెడిట్ కార్డు ద్వారా రూ.లక్ష, బంగారంపై రూ.2.50 లక్షల రుణం తీసుకున్నాడు. అప్పులు చెల్లించలేక సోమవారం ఉదయం గ్రామంలోని శ్మశానవాటిక వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

‘ఉత్సవ కమిటీలో ప్రాధాన్యత ఇవ్వాలి’



సమావేశంలో మాట్లాడుతున్న రాఘవేంద్ర

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయ ఉత్సవ కమిటీలో లంబాడీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ నాయకులు భానోతు రాఘవేంద్ర, భూక్య రాములు, వాంకుడోతు రాజు కోరారు. మండలంలోని సూర్యతండాలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కమిటీలో లంబాడీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా పార్టీలోని కొందరు నాయకులు యత్నిస్తున్నారని తెలిపారు. ఉత్సవ కమిటీలో లంబాడీలకు జరుగుతున్న అన్యాయాన్ని సహించేది లేదన్నారు. గతంలోనూ తమకు అన్యాయం జరిగిందని చెప్పారు. ఈసారి తమకు కమిటీలో చోటు కల్పించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని తెలిపారు. మండలానికి చెందిన ఇద్దరు నాయకుల తీరుతోనే లంబాడీలకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వెలిబుచ్చారు.

మాజీ కౌన్సిలర్‌కు పరామర్శ

నర్సంపేట : పట్టణంలోని 23వ వార్డు మాజీ కౌన్సిలర్ బానాల ఇందిరను ఆమె భర్త రాంబాబు ఇటీవల మృతి చెందిన క్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. తొలుత రాంబాబు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్, పార్లమెంటరీ నియోజకవర్గ కోకన్వీనర్ కట్ల రాంచంద్రారెడ్డి, బీజేవైఎం మాజీ నియోజకవర్గ కన్వీనర్ జూలూరు మనీశ్ గౌడ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ గంగిడి మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన వెంకన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆటో యూనియన్ నాయకులు పరామర్శించారు. తొలుత వెంకన్న చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి 1.5 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పసునూరి వెంకన్న, నాయకులు ప్రభాకర్, సురేశ్, రమేశ్, శ్రీను, రాజు, బాబర్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే విద్యార్థుల ఉన్నతి

ఖానాపురం : ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమన్వయంతోనే విద్యార్థుల ఉన్నతి సాధ్యమని ఏఏపీసీ చైర్మన్ రాజమ్మ తెలిపారు. మండలంలోని దబ్బీర్‌పేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోందని చెప్పారు. ఉపాధ్యాయులపై తప్పుడు ప్రచారం చేయొద్దని సూచించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కూడా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు రాజు, యాకయ్య, కుమారస్వామి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలే ధ్యేయం

● ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

ఖానాపురం : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ధ్యేయంగా ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పని చేయాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ పోరిక రవీందర్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపైనే ఉందన్నారు. ఎప్పటికప్పుడు గర్భిణుల నమోదుతోపాటు మాతా శిశు సంరక్షణ, వ్యాధి నిరోధక టీకాలు, టీబీ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎండాకాలంలో నీరు కలుషితం అయితే ప్రజలు టైఫాయిడ్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. 30 ఏళ్లకుపైబడిన అందరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో వైద్యులు జ్యోతి, కల్పన, సునీత, రాకేశ్, సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్లు దామోదర్‌రెడ్డి, దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులు మొదలుపెట్టండి

● ఎంపీడీఓ శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

పర్వతగిరి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు మొదలుపెట్టాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకం పనుల్లో 80 రోజులకు మించి పని చేసిన కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించి వంద రోజులు పూర్తి చేయించాలని సూచించారు. రిజిస్టర్లు, జాబ్ కార్డులు అప్‌డేట్ చేయాలని చెప్పారు. నర్సరీల్లోని బ్యాగ్‌ల్లో నారు, విత్తనాలు నింపాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో లేబర్ రిపోర్టు తక్కువగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాల్లోని అన్ని ప్లాంటేషన్లకు వాచర్లు ఉండాలని, బతికున్న మొక్కలకు సంబంధించి నిర్వహణా బిల్లులు అందజేయాలని, జూలైలో మొక్కలు నాటేందుకు ప్రదేశాలను గుర్తించాలని చెప్పారు. సమావేశంలో ఏపీఓ సుశీల్‌కుమార్, ఈసీ రాజ, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేశ్, పంచాయతీ కార్యదర్శులు యాకూబ్ నాయక్, అశోక్, టెక్నికల్ అసిస్టెంట్లు అన్వేష, స్రవంతి, గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



చెన్నారావుపేట : ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులతో హెచ్‌ఎం, తదితరులు

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా తరగతులు బోధించారు. డీఈఓగా పూట్ల చైతన్య, ఎంఈఓగా వట్టి శృతి, హెచ్‌ఎంగా కల్లెపు శ్రీజ, పీఈటీలుగా కాసాని అభిలాష్, అనుముల ప్రణయ్, మేకల స్రవంతి, జూనియర్ అసిస్టెంట్‌గా అమీర్ పాషా, కడిదెల శ్రీకాంత్, అటెండర్‌గా పరికి సన్నీ వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు హెచ్‌ఎం జయ బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోశ్‌కుమార్, బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మొగిలి, సుందర్, సతీశ్‌కుమార్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట హైస్కూల్‌లో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో డీఈఓగా అఫ్సర్, హెచ్‌ఎంగా చిరుతం సౌమ్య వ్యవహరించారు. కార్యక్రమంలో ప్రధానోపాయురాలు పాపమ్మ, ఉపాధ్యయులు కిశోర్, రవి, ఉమాదేవి, రజిని, అనుపమ, శ్రీనివాస్‌రెడ్డి, సీఆర్పీలు సంపత్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

రేకంపల్లిలో..

దుగ్గొండి : మండలంలోని రేకంపల్లిని లిటిల్ ఫ్లవర్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తరగతులు బోధించి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడుగా బూరగాని నేహ, ఉపాధ్యాయులుగా సహస్ర, ప్రవస్తి, అమృత, వైష్ణవి, సాత్విక, మైత్రి, విజయ్, మణికంఠ, ప్రణయ్, సుశాంత్, వరుణ్, రాంచరణ్, హర్షవర్ధన్, అభిలాష్ వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం గట్టికొప్పుల విజేందర్, ఉపాధ్యాయులు రాధిక, శ్రావణి, మానస, జీవన్, కొమురయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే సత్ఫలితాలు ఖాయం

● తహసీల్దార్ రాజ్‌కుమార్



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న తహసీల్దార్

సంగెం : విద్యార్థులు పట్టుదలతో చదివితే సత్ఫలితాలు సాధించడం ఖాయమని తహసీల్దార్ రాజ్‌కుమార్ చెప్పారు. మండలంలోని గవిచర్ల మోడల్ స్కూల్‌లో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యం ఏర్పర్చుకుని సాధన దిశగా ప్రణాళికాయుతంగా చదవాలని సూచించారు. తద్వారా వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి, ఎంపీడీఓ రవీందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ రాధిక, పంచాయతీ కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్లు కీలకం



సబ్‌స్టేషన్ ఆవరణలో లైన్‌మెన్లతో డీఈ తిరుపతి, తదితరులు

దుగ్గొండి : విద్యుత్ సరఫరాలో లైన్‌మెన్లు కీలకమని ట్రాన్స్‌కో డివిజనల్ ఇంజనీర్ (డీఈ) తిరుపతి స్పష్టం చేశారు. విద్యుత్ లైన్‌మెన్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని రేకంపల్లిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్లను మంగళవారం ఆయన ఆధ్వర్యంలో ఉద్యోగులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈ ఇతరుపతి మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ అంతరాయం కలిగినా రాత్రింబవళ్లు వర్షంలో, చలిలోనూ లైన్‌మెన్లు విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణలో లైన్‌మెన్ల విధులు క్రియాశీలకమని చెప్పారు. కార్యక్రమంలో వరంగల్ సర్కిల్ కార్యాలయ డీఈటీ ఆనందం, ఏఈ ప్రత్యూష, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీమ్ పాషా, లైన్‌మెన్లు అజయ్, నాగరాజు, ఖాజా, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.